సాక్షి అనకాపల్లి

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



లక్ష కుంకుమార్చన

డాబాగార్డెన్స్ : విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు.



కులశేఖర్‌కు నివాళి

గోపాలపట్నం: ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు నివాళులర్పించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 4న 3 మి.మీ, 5న 2 మి.మీ, 6న 5 మి.మీ, 7న 4 మి.మీ, 8న 4 మి.మీలు వర్షపాతం నమోదు అవుతుందని చెప్పారు.

న్యూస్‌రీల్

రసాయన పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

- జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి

ఉక్కునగరం: రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని.. ఆయా యాజమాన్యాలు అధిక భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి సూచించారు. ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్, సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ సహకారంతో మంగళవారం ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో 'రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణ'అనే అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివశంకరరెడ్డి మాట్లాడుతూ విశాఖ రీజియన్‌లో దాదాపు 165 రసాయన పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో రెండు ఫ్యాక్టరీల్లో పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాలు జరగకుండా నివారించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫార్మాజెల్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అనంత్ బర్నడికర్, లారస్ ల్యాబ్స్‌కు చెందిన శ్రీనివాసరావు మాట్లాడారు.

ఎస్పీ అచ్యుతాపురం స్టేషన్ సందర్శన



అచ్యుతాపురం స్టేషన్‌లో ఎస్పీ తుహిన్ సిన్హాకు పోలీసుల గౌరవ వందనం

అచ్యుతాపురం: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నిరుపేదలు, మహిళలు, వృద్ధులు స్టేషన్‌కు వచ్చినప్పుడు సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు. గంజాయి నివారణకు చర్యలు తీసుకోవాలని, సారా తయారీ స్థావరాలను ధ్వంసం చేయాలని చెప్పారు. తరచూ నమోదవుతున్న కేసులపై ఆరా తీయాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వేలి ముద్రలు తీసుకోవాలని, రాత్రి వేళ గస్తీ పెంచాలని సూచించారు. సీఐ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రతిష్ఠించి, వంద సంవత్సరాలైన సందర్భంగా వికాసతరంగిణి వారి సహకారంతో బుధవారం సాయంత్రం 6 గంటలకు 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం' నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్‌స్వామి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. శారదానది తీరం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు చిన్న జీయర్‌స్వామిని భారీ ర్యాలీతో తీసుకువెళతామని ఆయన చెప్పారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

- అదుపులో ఇద్దరు నిందితులు
- గోప్యంగా ఉంచిన పోలీసులు

అనకాపల్లి: అనకాపల్లి–చోడవరం రహదారిని అనుకుని ఊడేరు పెట్రోల్ బంక్ సమీపంలో సుమారు 40 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అల్లూరి జిల్లా పాడేరు నుంచి నర్సీపట్నం మీదుగా అనకాపల్లి వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో 40 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అనకాపల్లి రూరల్ పోలీసులు గోప్యంగా ఉంచారు.

భూసేకరణలో సర్కారు దూకుడు

- రైతుల ప్రమేయం లేకుండా భూముల గుర్తింపు, సర్వేలు
- కార్పొరేట్ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు
- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండానే భూముల కేటాయింపు

పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూముల సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. రైతుల ప్రమేయం లేకుండా వారికి తెలియకుండానే భూములను గుర్తించడం, సర్వే చేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెట్టడంలో ఉన్న ఆసక్తి రైతులకు నష్టపరిహారం చెల్లింపుల్లో చూపించడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా రైతుల భూములను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు తాపత్రయపడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడచిన నెల రోజుల నుంచి భూసేకరణ విషయంలో ప్రభుత్వ వ్యవహారశైలి పరిశీలిస్తే ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నోటీసులు లేకుండా భూములు సర్వే చేయడాన్ని అడ్డుకుంటున్న రైతులు (ఫైల్)



బోదిగల్లం రైతులతో చర్చలు జరుపుతున్న అధికారులు

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నక్కపల్లి మండలంలో చందనాడ, రాజయ్యపేట, డీఎల్‌పురం, అమలాపురం, వేంపాడు గ్రామాల పరిధిలో 4500 ఎకరాలను సేకరించిన సంగతి తెలిసిందే. ఈ భూముల్లో 2 వేల ఎకరాలను గత ప్రభుత్వం మిగతా రాష్ట్రాలతో పోటీ పడి తెచ్చుకున్న బల్క్‌డ్రగ్ పార్క్, ఇతర అనుబంధ కంపెనీల కోసం కేటాయించింది. భూసేకరణ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించలేదు. దీంతో రైతులంతా ప్యాకేజీ ఇచ్చే వరకు భూములు స్వాధీనం చేయబోమంటూ ఆందోళన చేస్తున్నారు. ఇంతలో ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు రాజయ్యపేట సమీపంలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేస్తామని, భూములు కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేయడంతో కూటమి సర్కారు ఏపీఐఐసీ సేకరించిన 2600 ఎకరాలను స్టీల్‌ప్లాంట్‌కు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. వీటిలో 750 ఎకరాలు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని బదలాయించాల్సి ఉంటుంది. కేంద్రం ఒప్పుకోకపోతే స్టీల్ ప్లాంట్‌కు మరో 750 ఎకరాలు ఆగమేఘాల మీద సేకరించి అప్పగించాల్సి ఉంటుంది. బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములు పూర్తిస్థాయిలో కేటాయించకపోతే కేంద్ర ప్రభుత్వ ఆగ్రహానికి గురికాక తప్పదు.

4 (1) నోటిఫికేషన్ విడుదల చేయకుండానే..

ప్రభుత్వం భూసేకరణ విషయంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. ప్రజావసరాల కోసం భూములు సేకరించాలంటే గ్రామాల వారీగా సర్వే నెంబర్లు, రైతుల వివరాలతో సహా 4 (1) నోటిఫికేషన్ విడుదల చేయాలి. రైతులతో గ్రామసభలు నిర్వహించాలి. వారి ఆమోదంతో నష్టపరిహారం నిర్ణయించి అవార్డు పాస్ చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి. నిర్వాసితులకు పునరావాసం, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. ఇవేమీ లేకుండానే ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేటలో కొంత భూమిని, నక్కపల్లి మండలం పెదతీనార్లలో 1000 ఎకరాలను, వేంపాడు, నెల్లిపూడి గ్రామాల్లో కొంత భూమిని గుర్తించి రైతులకు తెలియకుండానే వారికి నోటీసులు ఇవ్వకుండానే సర్వే చేయడం ప్రారంభించారు. తమకు తెలియకుండా తమ భూములు సర్వే చేయడాన్ని రైతులు అడ్డుకున్నారు. దీంతో సర్వే తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో నోటిఫికేషన్ ఇచ్చి భూసేకరణ చేస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పునరావాసం కోసం డైరెక్ట్ పర్చేజ్..

ఇక ఏపీఐఐసీకి భూములిచ్చిన గ్రామాల్లో బుచ్చిరాజుపేట, బోయపాడు, తమ్మయ్యపేట, మూలపర, పాటిమీద, డీఎల్‌పురం వాడపేట తదితర ప్రాంతాలను ఖాళీ చేయించాల్సిన పరిస్థితి ఉంది. అలాగే ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నవారికి కూడా పునరావాసం కల్పించాలి. పునరావాసం కోసం సేకరించే భూముల్లో కూడా ప్రభుత్వం ఏకపక్షంగానే వ్యవహరిస్తోంది. డైరెక్ట్ పర్చేజ్ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది. పెదబోదిగల్లంలో 170 ఎకరాలను సేకరించడానికి అవసరమైన భూములను రైతులకు తెలియకుండానే గుర్తించింది. వారికి అప్పటికప్పుడు సమాచారం ఇచ్చి చర్చలకు రావాలని ఆహ్వానించింది. నర్సీపట్నం ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ తదితరులు రైతులతో మాట్లాడుతూ.. ఏపీఐఐసీ నిర్వాసితులకు మీ గ్రామంలో పునరావాసం కల్పిస్తామని 170 ఎకరాలు సేకరిస్తున్నామంటూ తెలియజేశారు. దీంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30 లక్షలు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ కొంతమంది సుముఖంగా లేరు. బోదిగల్లంలో 170 ఎకరాలను డైరెక్ట్ పర్చేజ్ విధానంలో ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా నేరుగా కొనుగోలు చేసే ప్రయత్నాలకు ప్రభుత్వం సిద్ధపడుతోందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఇదే గనుక జరిగితే రైతులకు నష్టం కలుగుతుంది. ఒప్పందం మేరకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తారు. ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వరు. రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కొని ఎక్కువ ధరకు కంపెనీలకు కేటాయిస్తోందని, పారిశ్రామికవేత్తలపై ఉన్న ప్రేమ రైతులపై లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

చిన సారాడలో పడగ విప్పిన కిడ్నీ వ్యాధి

- పెరుగుతున్న బాధితులు
- ఇప్పటికే ఏడుగురు మృతి



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

మాడుగుల: మండలంలో అవురువాడ పంచాయతీ చినసారాడలో రోజురోజుకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధితో ఏడుగురు మృత్యువాత పడ్డారు. దీంతో మంగళవారం ఎంపీడీవో కొంకి అప్పారావు గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి చెందిన గిరిజనులు కొండలు కోనలు ఎక్కేందుకు నాటుసారా విరివిగా తాగుతున్నారని, దీంతో వీరికి నొప్పులు అధికంగా వస్తున్నాయని, ఆ బాధ తట్టుకోవడానికి అందుబాటులో ఉన్న డైక్లోఫిన్ టాబ్లెట్లు మోతాదుకు మించి వాడడం వలన వీరికి కిడ్నీ సమస్యలు వస్తున్నాయని కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి మాలెం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అప్పారావు మాట్లాడుతూ.. నాటుసారా ఎవరూ తాగరాదని, నొప్పులున్నా సరే మోతాదుకి మించి మందులు వాడరాదని అవగాహన కల్పించారు. తమ గ్రామంలో తాగునీటికి పరీక్షలు జరపాలని, కిడ్నీ వ్యాధితో బాధ పడేవారికి రూ.10 వేల పింఛన్ మంజూరు చేయాలని గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు. సర్పంచ్ కిమిడి మోద హైందవి గుప్తేశ్వరి, ఎంపీటీసీ కిమిడి క్రిష్టమ్మదొర, గ్రామ నాయకులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

13న ఆర్‌ఏఆర్‌ఎస్‌లో కిసాన్ మేళా

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈనెల 13న కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్‌మేళాకు జిల్లాలోని శాస్త్రవేత్తలు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

లోటు తెలీకుండా పెంచండి.. అద్భుతాలు సృష్టిస్తారు



భవిత కేంద్రంలో దివ్యాంగ బాలల మధ్య కూర్చొని వారితో ముచ్చటిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

- దివ్యాంగుల దినోత్సవంలో డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి: దివ్యాంగ బాలలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు మనో ధైర్యం కోల్పోకూడదని, పిల్లల్లోని వైకల్యం వారికి తెలియకుండా పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని.. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఈ వారంలో అలవెన్స్‌లను అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు పిల్లల వైకల్యాన్ని ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని ఆయన కోరారు. భవిత కేంద్రంలోని విద్యార్థులతో నేలపై కూర్చొని ఆయన ముచ్చటించారు. ఎంఈవో–2 కోటేశ్వరరావు, హెచ్‌ఎం ప్రసాద్, మండల స్పెషల్ ఎడ్యుకేటర్ బి.వి.వరప్రసాద్ పాల్గొన్నారు.



సేవకులను సత్కరిస్తున్న జేసీ జాహ్నవి

విభిన్న ప్రతిభావంతులు విజేతలైతేనే.. సమాజానికి సమగ్ర ప్రగతి

తుమ్మపాల: 'సమగ్రమైన, స్థిరమైన భవిష్యత్తు కోసం దివ్యాంగుల నాయకత్వాన్ని విస్తరించడం' అనే థీమ్‌తో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరుపుకుంటున్నామని, అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించి విజేతలుగా నిలబెట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వి.వి.రమణ రైతు భారతిలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో దివ్యాంగుల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం నుంచి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. అనంతరం బధిరులకు ఐదు టచ్‌ఫోన్లు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వివిధ సంస్థల్లో వికలాంగులకు సేవలందిస్తున్న వలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. దివ్యాంగ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్ పాల్గొన్నారు.

గర్భిణి డోలీ మోత ఘటనపై కదిలిన అధికారులు



బోడిగరువు గిరిజన గ్రామానికి కాలినడకన వెళుతున్న అధికారుల బృందం



బోడిగరువులో గర్భిణి సాహు శ్రావణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బోడిగరువులో విచారణ
- 3 కి.మీ మేర కాలినడకన గ్రామానికి చేరుకున్న అధికారులు

దేవరాపల్లి: గిరిజనుల డోలీ మోత కష్టాలపై అధికార యంత్రాంగం కదిలింది. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ బోడిగరువు గ్రామానికి చెందిన నిండు గర్భిణి సాహు శ్రావణిని సోమవారం సుమారు మూడు కిలోమీటర్ల మేర డోలీ మోతలో గెడ్డలు, వాగులు దాటి తరలిస్తూ పడిన ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ స్పందించారు. బోడిగరువులో స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రహదారి పరిస్థితిని పరిశీలించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి. నాగశిరీష, డీఎల్‌డీవో ఎం.మంజులవాణి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సుమారు మూడు కిలోమీటర్ల మేర బురదమయంగా మారిన రోడ్డులో కాలినడకన అతికష్టం మీద బోడిగరువు గ్రామానికి చేరుకున్నారు. సాహు శ్రావణి కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. కె.కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రావణి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు అధికారులకు తెలిపారు. స్థానికంగా గిరిజనుల ఇబ్బందులను, సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడి రోడ్డుకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.నాగశిరీష, డీఎల్‌డీవో ఎం.మంజులవాణి తెలిపారు. వీరి వెంట స్థానిక పంచాయతీ సెక్రటరీ సిహెచ్. ఈశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ పేరి, రాజేశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్–అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

అదే రోడ్డు.. అవే నిధులు...

- నాడు ఎమ్మెల్యే గణేష్ చేతుల మీదుగా శంకుస్థాపన
- నేడు మళ్లీ స్పీకర్ చేతుల మీదుగా భూమిపూజ



రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న స్పీకరు అయ్యన్నపాత్రుడు. పక్కన కలెక్టర్ విజయకృష్ణన్



ఇదే రోడ్డుకు 2022 డిసెంబరు 4వ తేదీన పనులు ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే గణేష్ (ఫైల్)

నాతవరం : మండలంలో నర్సీపట్నం తుని మధ్య శృంగవరం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు రూ 12కోట్ల 33లక్షలతో మంగళవారం అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు భూమి పూజ చేశారు. ఇదే తారురోడ్డుకు 2022 డిసెంబరు 4వ తేదీన రూ.12కోట్ల 65లక్షలతో అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లో రోడ్డు కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు జాప్యం చేశారు. ప్రస్తుతం అదే రోడ్డుకు అదే నిధులతో స్పీకరు అయ్యన్నపాత్రుడు, కలెక్టరు విజయ కృష్ణన్‌తో కలసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు, ఒకే రోడ్డుకు రెండేళ్ల తేడాతో ఇద్దరు భూమి పూజ చేయడం పట్ల ఈ ప్రాంతంలో చర్చ జరుగుతుంది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకరు అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి అయిదు నెలల వ్యవధిలోనే నియోజకవర్గం అభివృద్ధికి రూ.78 కోట్లు నిధులు మంజూరు చేశానన్నారు. అందులో నాతవరం మండలానికి రూ. 21 కోట్లు ఇచ్చానన్నారు. రోడ్డు పనులకు రెండుసార్లు భూమి పూజ చేయడంపై ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్ మాట్లాడుతూ గతంలో కాంట్రాక్టరు రోడ్డు పని పూర్తి చేయకుండా వదిలేసారన్నారు. అ పనులకు సంబంధించి నిధులు మరలా రీషెడ్యూలు చేసి కాంట్రాక్టరుతో స్పీకరు మాట్లాడడం జరిగిందన్నారు. కలెక్టరుతో మాట్లాడి ఆమోదం తీసుకుని రోడ్డు పనులకు తిరిగి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం శిలఫలకం లేకుండా స్పీకరు పనులు ప్రారంభించారన్నారు.

అల్లుడే ఇంటి దొంగ

- ఏడు తులాల బంగారు ఆభరణాల అపహరణ
- ఫిర్యాదు చేసిన అరగంటలో ఛేదించిన పోలీసులు



అపహరించిన బంగారు ఆభరణాలు



నిందితుడితో సీఐ కోటేశ్వర్రావు, ఎస్ఐ రామకృష్ణారావు, పోలీసులు

రోలుగుంట : ఇంటి దొంగే నగలు చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడ్డ ఘటన శరభవరంలో జరిగింది. గ్రామంలోని ఊట నూకరాజు ఇంట్లో ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందగా ఎస్ఐ పి.రామకృష్ణారావు, తన సిబ్బందితో కలిసి అరగంటలోనే కేసును ఛేదించి దొంగను పట్టుకున్నారు. ఎస్ఐ విలేకరులకు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఊట నూకరాజు తన భార్య లక్ష్మితో కలసి ఈ నెల1వ తేదీన పొలం పనులకు వెళ్లిపోయారు. వారు ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఏడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో రోలుగుంట పోలీసులకు ఈ నెల రెండో తేదీన బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంఘటన స్థలానికి వెళ్లి క్లూస్ టీంతో విచారణ జరిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి స్కూటీపై ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకూ గ్రామంలో సంచరించినట్టు తెలుసుకున్నారు. ఆనవాళ్లమేరకు ఎస్ఐ అనుమానిత వ్యక్తి అయిన గృహ యజమాని అల్లుడు లాలం సింహాచలంకు ఫోన్ చేసి ఎక్కడున్నారని ఆరా తీయగా తాను గ్రామానికి రాలేదని వేరే పనిమీద వైజాగ్ వెళ్లినట్టు తెలిపాడు. అయితే దర్యాప్తులో భాగంగా అతని కాల్ డేటా పరిశీలించిన మీదట అనుమానితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి, బీరువా తెరిచి ఆభరణాలు దొంగలించినట్టు అంగీకరించాడు. వాటిని తన స్కూటీలోనే దాచి నర్సీపట్నం వెళ్లి విక్రయించే ప్రయత్నంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిర్యాదు అందిన అరగంటలోనే కేసును ఛేదించిన విషయం తెలిసిన ఎస్పీ రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో పాల్గొన్న కొత్తకోట సీఐ తమ సిబ్బందిని అభినందించారు.

క్లుప్తంగా

అవయవదాతల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు



అప్పలనాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న సీతామహాలక్ష్మి

అచ్యుతాపురం: అవయవ దాతల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మెరుగు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం అఖిల భారత సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అప్పలనాయుడుకు అందజేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎం. అప్పలనాయుడు ఉన్నత విద్యావంతుడే కాకుండా సమాజ సేవాతత్పరుడిగా పేరు తెచ్చుకున్నారు. గతంలో ఎంపీటీసీ మెంబర్‌గా పనిచేశారు. గత జూలైలో ఆయన అన్న కూతురు అడవివరంలో ప్రమాదానికి గురి అయింది. కిమ్స్ ఆస్పత్రిలో వైద్యం అందించినా ఆమె కోలుకోలేదు. బ్రెయిన్ డెడ్ అయింది. అవయవదాన ఉద్యమం పట్ల అవగాహన కలిగిన అప్పలనాయుడు కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను ఒప్పించి ఆమె అవయవాలను దానం చేయించారు. ఆయనను గూడూరు సీతామహాలక్ష్మి అభినందించారు.

చేపల మేతకు నిషేధిత వ్యర్థాల తరలింపు

- సీపీఎం నేత వెంకన్న సమాచారంతో అధికారుల దాడి
- ఐదు డ్రమ్ముల్లోని వ్యర్థాల పూడ్చివేత



నిషేధిత వ్యర్థాలను గొయ్యిలో పూడ్చుతున్న మత్స్యశాఖ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

దేవరాపల్లి : చేపల చెరువుల్లో చేపలకు మేతగా వేసేందుకు నిషేధిత వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను మత్స్యశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. చేపల చెరువులకు నిషేధిత వ్యర్థాల తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు మత్స్యశాఖ సిబ్బంది రెవెన్యూ, పోలీసులతో కలిసి మంగళవారం దాడులు చేశారు. వ్యాన్‌లో తరలిస్తున్న 8 డ్రమ్‌లకు గాను 5 డ్రమ్‌ల్లో నిషేధిత వ్యర్థాలు ఉన్నట్లు నిర్ధారించారు. వాటిని తారువ సమీపంలోని బలే వెంకటేశ్వరరావు చెరువుకు సమీపంలో గొయ్యిలో పూడ్చారు. వ్యర్థాలు తరలిస్తున్న చేపల చెరువుల నిర్వాహకులపై చర్యల నిమిత్తం పోలీసులకు సమాచారం అందించామని మత్స్యశాఖ అసిస్టెంట్‌లు కె.కీర్తి, రజాక్, తెలిపారు. దాడుల్లో స్థానిక వీఆర్‌వో పి. స్వాతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అక్రమంగా చేపడుతున్న చేపల చెరువుల నిర్వాహలకు నోటీసులు ఇచ్చినా బైండోవర్ కేసులు నమోదు చేసినా వారి తీరు మారడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చేపల చెరువుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆరిపోయిన ఆశల దీపం

- బస్సు ఎక్కుతుండగా జారి పడిన డిప్లమో విద్యార్థి
- వెనక చక్రాల కింద పడి నలిగిన ప్రాణం
- కశింకోట మండలం తాళ్లపాలెం కూడలిలో ఘటన
- మృతుడిది యలమంచిలి మండలం పెద షేకిళ్లపాలెం గ్రామం



బస్సు ఎక్కబోతూ జారి పడి మృతి చెందిన విద్యార్థి మణికంఠ



మణికంఠ (ఫైల్)

కశింకోట/యలమంచిలి రూరల్: ఆశల దీపం ఆరిపోయింది. ఉన్నత విద్య అభ్యసించి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడని పడిన ఆశలు అడియాసలయ్యాయి. కళాశాల నుంచి ఇంటికి వెళ్లడం కోసం ఆర్టీసీ బస్సు ఎక్కుతూ కాలు జారి పడిన ఘటనలో యలమంచిలి మండలం పెద షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు మణికంఠ (18) దుర్మరణం చెందాడు. కశింకోట మండలం తాళ్లపాలెం కూడలిలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి మండలం షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన మణికంఠ మాకవరపాలెంలోని అవంతి కళాశాలలో డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేస్తుంటాడు. ఎప్పటిలాగే వెళ్లిన మణికంఠ కళాశాల ముగియగానే సాయంత్రం మాకవరపాలెం నుంచి మండలంలోని తాళ్లపాలెం కూడలి వరకు బస్సులో వచ్చి దిగాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళుతున్న పల్లె వెలుగు బస్సు ఎక్కబోయి జారి పడిపోవడంతో వెనక చక్రాలు ఆయన మీద నుంచి వెళ్లిపోయాయి. సుమారు 50 మీటర్ల దూరం వరకు బస్సు ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మణికంఠ మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పెద షేకిళ్లపాలెంలో విషాదఛాయలు

మణికంఠ మృతితో పెద షేకిళ్లపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన చిన్నం నాయుడు, శివలక్ష్మి దంపతులకు కుమారుడు మణికంఠ, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు మూడేళ్ల క్రితమే వివాహం చేశారు. వీరిది నిరుపేద కుటుంబం. చిన్నం నాయుడు రోజువారీ కూలీ. కుమారుడు మణికంఠ(17) పదో తరగతి తర్వాత డిప్లమో చదువుతానని చెప్పడంతో మాకవరపాలెం అవంతి కళాశాలలో చేర్పించారు. రోజూలాగే కాలేజీకి వెళ్లిన కుమారుడు ఇంటికొచ్చేస్తాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులకు తాళ్లపాలెం కూడలి వద్ద పల్లెవెలుగు బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయాడన్న పిడుగులాంటి వార్త వినడంతో వారు కుప్పకూలిపోయారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత స్థితికి చేరుకుని తమకు అండగా ఉంటాడని భావించిన తల్లిదండ్రులు విగతజీవిగా మారిన కుమారుడ్ని చూసి తల్లడిల్లిపోయారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న నిజం తెలియడంతో తల్లిదండ్రులు, సోదరి అయ్యో ఎంత ఘోరం జరిగిపోయింది.. దేవుడా ఇక మాకు దిక్కెవరు, ఎవరి కోసం బతకాలంటూ అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీ వద్ద గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కలచివేసింది. ఇటీవల కాలంలో షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఊహించని విధంగా రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం పాలవడం గ్రామస్తులను తీవ్ర విషాదంలోకి నెడుతోంది. వరుస ప్రమాదాలతో భయాందోళనలకు గురవుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం సిగ్గుచేటు

- మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే
- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త జోగులు ధ్వజం



నక్కపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడవక ముందే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దుయ్యబట్టారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. ప్రజలంతా చంద్రబాబును నమ్మి ఓట్లేస్తే ఇప్పుడు మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా పెంచడం దారుణమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. నిధుల కొరత ఉన్న విషయం హామీలు ఇచ్చేటప్పుడు తెలియదా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తూ గత ప్రభుత్వ తప్పిదాల వల్లే విద్యుత్ కొనుగోలు భారం పెరిగిందని చెప్పడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను ఇళ్లకు పంపేస్తున్నాయని, కొన్ని కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు.. అన్నదాత సుఖీభవను అటకెక్కించారు.. ఉచిత బస్సు హామీని అమలు చేయలేదు.. ఇలా హామీలన్నింటిని నెరవేర్చకుండా మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. ఓట్లేసిన పాపానికి ఐదేళ్లు అనుభవించాల్సిందేనంటూ ప్రజలంతా నిట్టూరుస్తున్నారన్నారు.

హైవేపై ప్రమాదకర ప్రాంతాల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న పోలీసులు

పాయకరావుపేట: మండలంలోని నేషనల్ హైవేపై ప్రమాదకర ప్రాంతాలను మంగళవారం సీఐ అప్పన్న, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, నర్సీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.ఆర్.మూర్తి, ఆర్‌అండ్‌బీ ఏఈ బి.జ్ఞానేశ్వరరావు, నేషనల్ హైవే అధికారులు పరిశీలించారు. ఏయే ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకున్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ఆ ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. నామవరం జంక్షన్, పాయకరావుపేట వై జంక్షన్, కనుసా స్కూల్ జంక్షన్, తాండవ కూడలిని సందర్శించారు. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఒక రోడ్డు మ్యాప్ తయారు చేయాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు దిబ్బిడి హైస్కూల్ విద్యార్థి



రగ్బీ పోటీలకు ఎంపికైన గొంపా యశ్వంత్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యారావు, పీడీ



పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులతో హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: జాతీయ స్థాయి రగ్బీ అండర్–17 పోటీలకు దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గొంప యశ్వంత్ ఎంపికయ్యారు. గత నెల 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా వెనిగండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్–17 పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన యశ్వంత ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. త్వరలో బిహార్ జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఆడే జట్టుకు ఆయన ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్‌ఎం కె.సత్యారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం యశ్వంత్‌ను పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 21 మంది విద్యార్థులు

ఈ విద్యా సంవత్సరంలో పలు క్రీడా పోటీల్లో 21 మంది విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సత్యారావు తెలిపారు. కబడ్డీ, రగ్బీ, సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, పెన్సింగ్, ఖోఖో, వాలీబాల్, తదితర క్రీడల్లో 21 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

నాకవుట్‌కు విదర్భ

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీ నుంచి విదర్భ 18 పాయింట్లతో మరోసారి నాకవుట్‌కు చేరింది. మంగళవారం జరిగిన పోటీల్లో చండీగఢ్‌పై రైల్వేస్ ఐదు వికెట్ల తేడాతో, అస్సాంపై ఒడిశా 63 పరుగుల తేడాతో విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా తొమ్మిది ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. ఓపెనర్ స్వస్తిక్ సమాల్(68) అర్ధసెంచరీతో రాణించాడు. ప్రతిగా అస్సాం 8.1 ఓవర్లలోనే 57 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను తొమ్మిది ఓవర్లకు కుదించారు. డేనైట్‌గా జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చండీగఢ్ ఏడు వికెట్లకు 162 పరుగులు చేసింది. కీపర్ బ్యాటర్ పార్దీప్ (64) అర్ధసెంచరీ చేశాడు. ప్రతిగా రైల్వేస్ 18.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయతీరానికి చేరింది. కెప్టెన్ ఉపేంద్ర 52 పరుగులు చేశాడు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు ‘బూడి’ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

నర్సీపట్నం: హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఇటీవల రోబోటిక్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మంగళవారం పరామర్శించారు. ఆరోగ్యం గురించి గణేష్‌ను ఆయన ఆరా తీశారు. ముత్యాలనాయుడిని పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, చింతకాయల వరుణ్, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సర్పంచ్ బొడ్డు గోవిందరావు, తమాన శ్రీనువాసరావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

‘చలో అమరావతి’ విజయవంతం చేయాలి

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా మాల మహానాడు దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అమరావతి పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీలా గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎంపీ రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ జరిగితే ఏపీలో మెజార్టీ మాలల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. క్రిమిలేయర్ వల్ల మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ వ్యాప్తంగా దళితులు ఆందోళన చేస్తున్నారని, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 19న అమరావతిలో జరిగే చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వరిలో మానిపండు తెగులుపై దృష్టి సారించాలి

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని, దీనిపై రైతులు దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంకులతో ఉన్న వరి పొలంలో మానిపండు తెగులు ఆశించినట్లయితే, నివారణకు తెగులు ఆశించిన కంకులను జాగ్రత్తగా తీసివేసి పొలానికి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలన్నారు. అలాగే కార్బెండజిం 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. గత వారం వర్షాలు, గాలులకు పడిన వరి పనలను లేపి నిలబెట్టాలన్నారు. అప్పుడే గింజ రంగు మారకుండా నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. వరి పొలం కంకులతో ఉన్నట్లయితే మొలక రాకుండా ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కోసిన పనలు పొలంలో తడిచినట్లయితే అవసరాన్ని బట్టి ఎకరానికి 25 కేజీల ఉప్పును కోసిన పనలపై చల్లితే గింజ రంగు మారకుండా ఉంటుందన్నారు. ఎండరాగానే పనలను తిరగేసి ఆరబెట్టిన తరువాత నూర్చుకోవాలన్నారు. రబీలో వరి వేసే రైతులు నారుమడి వేసుకోవచ్చని, ఎకరానికి 20–25 కిలోల వరి విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. నారుమడి వేసిన 4–7 రోజులప్పుడు కలుపు నివారణ పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్‌కలుపు మందును ఎకరానికి 100 గ్రా.ల చొప్పున 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. రబీలో రాగి వేసే రైతులు ఎకరానికి 2.5 కిలోల విత్తనం చొప్పున నారు వేసుకోవచ్చని, 5 సెంట్ల నారుమడికి 1.5 కిలోల యూరియా, 4 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.0 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



కేపీ అగ్రహారం నూకాంబిక ఆలయంలో పగలు గొట్టిన సీసీ కెమెరా



అయితంపూడి ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీకి గురైన హుండీ

బుచ్చెయ్యపేట: మండలంలో కేపీ అగ్రహారం, అయితంపూడి గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేపీ అగ్రహారంలో నూకాంబిక దేవాలయంలో సీసీ కెమెరాలు పగలగొట్టి, అమ్మవారి వెండి కిరీటాన్ని దొంగలించుకుపోయారు. ఈ వెండి కిరీటం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుదని అంచనా. అయితంపూడి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. మంగళవారం ఉదయం ఆలయ పూజారి పిళ్లా అప్పలనర్సమ్మ పూజలు చేయడానికి వెళ్లి చూడగా, ఆలయం గేటుకు ఉన్న తాళం పగలు గొట్టి కనిపించింది. హుండీ కనిపించకపోవడంతో ఆమె గ్రామస్తులకు తెలియజేసింది. గ్రామానికి సమీపంలోని సీతయ్య చెరువు వద్ద ఉన్న పొకల వద్ద హుండీని పగలు గొట్టి నగదును తీసుకుని వెళ్లాపోయారు. హుండీలో రూ.35 వేల వరకు ఉంటుదని సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఎస్ఎస్ఎఫ్ గ్రామ కన్వీనర్ రామారావు తెలిపారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కొండంత పండగ

- 8న మేరీమాత పండగ
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు
- 7వ తేదీ అర్ధరాత్రి నుంచి 8వ తేదీ అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు



ప్రధాన ఆలయం..

డాబాగార్డెన్స్(విశాఖ): నగరంలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోజ్‌హిల్స్)పై కొలువుదీరి కులమతాలతో సంబంధం లేకుండా భక్తులంతా కొలిచే తల్లి అమలోద్భవి(విశాఖపురి మేరిమాత). రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖపురికి ప్రత్యేక ఆభరణం. దీనినే ‘కొండగుడి’గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండుగకు హిందూ, ముస్లిం, కథోలిక, కథోలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. కొండమాత ఉత్సవాలు దాదాపు తొమ్మిది రోజుల పాటు సాగుతాయి. వీటిలో చివరి రోజున మాతను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ ఉత్సవాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ ఆదివారం వరకూ జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. కొండగుడిపై వెలసిన అమలోద్భవి మాత పట్ల అపారమైన నమ్మకం గల భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించుకొని, అమ్మ ముందు మోకరిల్లుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

8న(పండగ రోజున) నిర్వహించే పూజలు..

వేకువజాము 4.30 గంటలకు, తిరిగి 5.15, 6 గంటలకు దేవాలయంలో ఆంగ్లంలో దివ్యపూజ, ఉదయం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ, 7.30 గంటలలకు గుహవద్ద తెలుగులో పొంటిఫికల్ దివ్యపూజాబలి నల్గోండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్‌చే నిర్వహించనున్నారు. ఉదయం 10, 11, 12 గంటలకు గుహవద్ద నూతన గురువులచే తెలుగులో దివ్యపూజ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన కార్యక్రమం, రాజమండ్రి విఆచరణ కర్త ఫాదర్ ఈగల రవీంద్రకుమార్‌చే దివ్యసత్ప్రసాద ఆరాధన ఏర్పాటు చేశారు. అనంతరం విశాఖపురి మేరిమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ జరపనున్నారు.

పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు..

అమలోద్భవి మాత ఉత్సవం పురస్కరించుకొని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు ఆలయానికి సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ఉంచారు. పండుగ రోజుల్లో భక్తులు వీటిని సందర్శించేందుకు అనుమతి కల్పించారు. ఉత్సవాలకు వచ్చేవారి సౌకర్యార్థం స్టాళ్ల ద్వారా తినుబండారాలతో పాటు ఆధ్యాత్మిక వస్తువులు, పుస్తకాలు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని వివిధ చర్చిల నుంచి వచ్చే యువకులు భక్తులకు సేవలందిస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి సెయింట్ ఎలాసిస్ పాఠశాలలో వసతి సౌకర్యం కల్పిస్తారు.



ప్రధాన ఆలయంలో విశాఖపురి మేరీమాత

అప్రమత్తతతోనే నేరాలకు అడ్డుకట్ట



మహిళా పోలీసులతో కలిసి సైబర్ నేరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీలు శ్రీనివాసరావు, మోహన్

నర్సీపట్నం: అప్రమత్తతోనే మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చనని అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సచివాలయ మహిళా పోలీసులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు భాగస్వాములు కావాలన్నారు. మత్తు పదార్థాల రవాణా, పేకాట, బాల్య వివాహాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఏ చిన్న ఘర్షణ జరిగినా మహిళా పోలీసులు వెంటనే సంబంధిత ఎస్ఐకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ఏదైనా ఘటన జరిగితే మౌనం వీడి నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ షీ టీం ప్రాముఖ్యత, పోక్సో చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈవ్ టీజింగ్, మహిళల గృహహింస, వరకట్నం, శారీరక వేధింపులను అరికట్టేందుకు మహిళా పోలీసులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏటీఎం పిన్ నంబర్, బ్యాంక్ ఖాతా తదితర వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. అనంతరం నేరాలకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సదస్సులో సీఐలు జి.గోవిందరావు, ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రమేష్, నియోజకవర్గం పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తాండవ కాలువలో జారి పడి వృద్ధురాలి మృతి



నూకాలమ్మ మృతదేహం

నాతవరం: తాండవ కాలువ గట్టుపై దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి వృద్ధురాలు మృతి చెందింది. మండలంలో గాంధీనగరం గ్రామానికి చెందిన కె.నూకాలమ్మ (62) మంగళవారం గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న తాండవ కాలువ గట్టుపై ఎప్పుడు మాదిరిగానే బట్టలు శుభ్రం చేసుకుంటుంది. వృద్ధాప్యం కావడంతో ప్రవహించే తాండవ కాలువ నీటిలోకి జారిపోయింది. స్థానికులు గమనించి వెంటనే కాలువలోకి దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే ఆమె మరణించింది. ఆమెకు వివాహం కాలేదు. తన తమ్ముడి వద్ద ఉంటుంది. మృతురాలి తమ్ముడు లక్ష్మణుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సిహెచ్ భీమరాజు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

డీ పాట్టా భూముల వివరాలను అందించండి

మాకవరపాలెం : డీ పట్టా భూముల వివరాలను త్వరితగతిన అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులతో పాటు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో డీ పట్టా భూముల వివరాలను మూడు రోజుల్లో సర్వే చేసి అందజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో తీగలు మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి–1 సెక్షన్ పరిధిలో భీమునిగుమ్మం, మళ్లవీధి, శేఖవీధి, నాగవంశంవీధి, నెయ్యిలవీధి, ఉడ్‌పేట, నర్సింగరావుపేట, చవితినీవీధి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం రహదారి, జీవీ కోటేశ్వరరావు వీధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, స్థానికులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ప్రత్యేక ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావుకు సన్మానం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం జరిగింది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అనకాపల్లిలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు హైస్కూలు హెచ్‌ఎం వై. విజయలక్ష్మి సుమన్, ఇతర ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1,680 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,200
మొదటి రకం	3,530	4,450
రెండో రకం	2,820	3,900
మూడోరకం	2,600	3,050

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డీసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–10 యూనిట్లు, ఓ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 352 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 308 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

కూటమి కక్ష.. విద్యార్థులకు శిక్ష

- పాఠశాలల అభివృద్ధిపై చంద్రబాబు సర్కారు శీతకన్ను
- నిలిచిపోయిన రెండో విడత నాడు–నేడు పనులు
- అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- మాజీ సీఎం జగన్ హయాంలోనే ప్రగతి కళ



నిలిచిపోయిన నాడు-నేడు పనులు

దశాబ్దాలుగా శిథిలమైన భవనాలతో అరకొర వసతులతో కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలకు గత వైఎస్సార్‌సీపీ పాలనలో మహర్దశ పట్టింది. కార్పొరేటుకు దీటుగా హంగులద్దుకుని కళకళలాడగా... కూటమి అధికారంలోకి రాగానే మిగిలిన పాఠశాలల అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో వెలవెలబోతున్నాయి. రెండో విడత నాడు – నేడు పనులు పూర్తిగా నిలిచిపోవడంతో అసంపూర్తిగా భవనాలు దర్శనమిస్తున్నాయి.



తరగతి గదుల్లో గోడలకు అసంపూర్తి మరమ్మతులు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం బడి పిల్లలపైనా కక్ష కట్టింది. జనసేన, టీడీపీ, బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా పాఠశాలల్లో నిర్మాణ సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉంది. పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు వాటి నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్, ఫ్లోర్‌పై టైల్స్, గోడలకు ప్లాస్టింగ్‌లు పూర్తి చేసి సున్నాలు వేయకుండా మధ్యలోనే వదిలేయడంతో గత్యంతరం లేక ఉపాధ్యాయులు అక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముందు నిలిచిపోయిన పనులు ఇప్పటికీ ముందుకు సాగలేదు. ఈ పనులు పూర్తి చేయకపోవడంతో అరకొర వసతుల మధ్య బోధించాల్సిన పరిస్థితులు దాపురించాయి. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే తప్ప పనులు ప్రారంభించేది లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● వైఎస్సార్‌సీపీ పాలనలో మారిన పాఠశాలల రూపురేఖలు

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని శిథిలమైన భవనాల్లో కునారిల్లుతున్న పాఠశాలలకు గత వైఎస్సార్‌సీపీ పాలనలో మహర్దశ పట్టింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో నవశకానికి శ్రీకారం చుట్టారు. మారుమూల గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి సైతం లక్షల్లో నిధులు వెచ్చించి కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు. మండలంలో గత ప్రభుత్వంలో నాడు – నేడు మొదటి విడతగా 42 పాఠశాలకు రూ.11.21 కోట్లతో నూతన భవనాలు నిర్మించి మౌలిక సౌకర్యాల ఏర్పాటుతో వాటి రూపురేఖలు మార్చేశారు. రెండో విడతగా మరో రూ.15.20 కోట్లతో 43 పాఠశాల అభివృద్ధికి నిధులు వెచ్చించి పనులు ప్రారంభించారు. మొదటి విడత పూర్తయినప్పటికి రెండో విడత దాదాపు 80 శాతం పూర్తయిన పనులు సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిధులు విడుదల నిలిపివేసింది. దాంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.

● రెండో విడత పనులకు బిల్లులు నిలిపివేత

రెండో విడత నాడు–నేడు పనుల్లో భాగంగా మండలంలో రూ.100 కోట్లు పైబడి మార్టూరు, కొండుపాలెం, తుమ్మపాల, తారక రామాకాలనీ పాఠశాలలకు, రూ.50 కోట్ల పైబడి సిహెచ్‌ఎన్.అగ్రహారం, దిబ్బపాలెం, కొండ కొప్పాక, మామిడిపాలెం, మత్రిపాలెం, రూ.50 కోట్ల దిగువన మరికొన్ని పాఠశాలలకు నిధులు వెచ్చించారు. వీటిలో దాదాపు అన్ని పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తయినప్పటికి సగానికి పైగా బిల్లులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది.

పనులు నిలిచి పోయాయి



రెండో విడత నాడు–నేడు పనులు ప్రస్తుతం నిలిచి పోయాయి. మండలంలో 43 పాఠశాలల్లో రెండో విడత పనులు పలు దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు ఇవి చివరి దశలోనే ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో భవనాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

– కోటేశ్వరరావు, ఎంఈవో, అనకాపల్లి మండలం

దొడ్డిదారిన రేషన్‌పై చర్యలకు డిమాండ్

అనకాపల్లి: పౌరసరఫరాల దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, కందిపప్పు, పంచదార పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్న ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు డిపోల సరకులను ఒకే ఎండీయూ ఆపరేటర్ కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. ఈ సరకులను అమ్ముకోవడానికి రేషన్ వాహనాలు వినియోగించుకోవడం దుర్మార్గమన్నారు. రేషన్ డిపోల్లో సరకుల నిల్వలను గతంలో నోటీస్ బోర్డుల ద్వారా వినియోగదారులకు తెలియజేసేవారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో డిపోల్లో ఎంత రేషన్ ఉంటుందో అర్థం కావడం లేదని వాపోయారు. రేషన్ బియ్యం గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారని, దీనిపై సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడం దారుణమన్నారు.

దివ్యాంగ విద్యార్థికి రిటైర్డ్ ఎంఈవో వితరణ



దివ్యాంగ విద్యార్థికి సొంత డబ్బులు రూ.6వేలు ఇస్తున్న అమృత్‌కుమార్

నాతవరం : ప్రత్యేక అవసరాలు పిల్లల నడుమ విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం వారిలో మనోధైర్యం నింపినట్టు అవుతుందని ఎంఈవో కామిరెడ్డి వరలహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కుండల దివ్యశ్రీ అనే చిన్నారికి ఏడాది కాలంగా సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నుంచి దివ్యాంగుల అలవెన్సు రాలేదు. ఆమెకు తాడి అమృత్‌కుమార్ సొంత డబ్బులు రూ.6 వేలు అందచేశారు. పిల్లలందరికీ భోజనాలు వడ్డించారు. విద్యకు అవసరమైన సామాగ్రిని అందజేసారు. అనంతరం ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. హెచ్‌ఎం ఇట్టంశెట్టి లోవకుమారి, విద్యా కమిటీ చైర్మన్ కరక భారతి పాల్గొన్నారు.

అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు



కనకమహాలక్ష్మి వీధిలో తక్కువ ధారతో నీరు సరఫరాతో కుళాయిల వద్ద మహిళల నిరీక్షణ

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో కుళాయిల నుంచి అరకొర నీటి సరఫరా జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కుళాయిల నుంచి సరిపడగా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కుళాయిల నుంచి నీటి ధార కూడా తక్కువగా వస్తుండటం వల్ల ఎక్కువ సేపు నీటి కోసం నిరీక్షించాల్సి వస్తోందంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. అధికారులు కల్పించుకుని పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



విరాళం చెక్కును ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్‌కు అందిస్తున్న దాత నరసింహకుమార్ కుటుంబం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన ఎం.నరసింహకుమార్ లక్షా 11 వేల 116 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డోనేషన్ కౌంటర్‌లో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ వి.సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన దేవుడుబాబు

పెందుర్తి: స్థానిక మత్రిచెట్ల కాలనీలో నివాసం ఉంటున్న గొర్లి దేవుడుబాబు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ బాబూరావు తెలిపిన వివరాలు.. అండమాన్‌లోని నేవల్ డాక్‌యార్డులో పనిచేస్తున్న దేవుడుబాబు ఇటీవలే సెలవుపై ఇంటికి వచ్చాడు. భార్య నగరంలోని ఆమె సోదరి ఇంట్లో ఉంటోంది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో ఫోన్ మర్చిపోయి బయటకు వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో తండ్రి తాతబాబు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సర్వీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భారతీయ విద్యావిధానంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. యువజన సర్వీస్ ప్రతినిధి ఎస్.బాబు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతుల్లో కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

9 నుంచి డేటా ఎంట్రీ ఉచిత శిక్షణ

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రేబాక పంచాయతీ పరిధి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ తరగతులను ఈ నెల 9 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో శిక్షణ తీసుకునేందుకు 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7013342667 సంప్రదించాలని సూచించారు.

గౌరమ్మ నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు



గవరపేటలో వెలసిన గౌరమ్మ

కశింకోట: గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నెలకొల్పిన ఆది గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఏటా మాదిరిగానే సంప్రదాయంగా ఆది గౌరమ్మను నెలకొల్పామన్నారు. కార్తీక మాస పూజలు ముగియడంతో నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బాణసంచా కాలుస్తూ ఊరేగించి గవరపేట శారదానదిలో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు



గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. గుర్తుతెలియని రైలు ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన అతడిని రైల్వే పోలీసులు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది వైద్యం అందిస్తున్నారు.

ఘనంగా భూలోకమాంబ పండగ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వేపగుంట బీసీ కాలనీలో వెలసిన భూలోకమాంబ వార్షిక పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. మహిళలు కోలాటమాడారు. కలశాలను ఊరేగించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దివ్యాంగ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



కశింకోట భవిత కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ కోరారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపీని దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నాయన్నారు. పింఛన్లు, ఉపకార వేతనాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు అందించడం తదితర సదుపాయాలను కల్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని అభివృద్ధి సాధించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం దివ్యాంగులకు పండ్లు, ప్రతిభావంతులకు బహుమతులను అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఎంఈవో పీఎస్ఎన్ మూర్తి, బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, డీపీఎస్ హైస్కూలు హెచ్‌ఎం ఆచంట రవి, తాళ్లపాలెం హైస్కూలు హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ రామునాయుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి. రమణమ్మ, ఎస్. దీప, ఫిజియోథెరపిస్టు గీతా మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు సంతోషి, శ్యామల, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీటిలో గింజ రంగు మారే అవకాశం



వరి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

తుమ్మపాల: తుఫాన్ ప్రభావంతో వరి పంట రెండు రోజులు కన్నా ఎక్కువగా నీటిలో ఉంటే గింజ రంగు మారే అవకాశం ఉందని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు తెలిపారు. మండలంలో సీతానగరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను, అధిక వర్షాల సమయంలో వరి పంటలో పిగులుపొట్ట పూత దశలో ఉండి నీటిలో మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం వల్ల పుష్పాలలో నీరు చేరి ఫలదీకరణ శక్తి కోల్పోతాయన్నారు. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిం, రెండు గ్రాముల కార్బండిజిం, మాంకోజెబ్ ఒక మిల్లీ లీటరు ప్రొపికొనజోల్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, వీఏఏ జ్యోతిమోహన్, వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

తడిచిన పనలపై ఉప్పు ద్రావణాన్ని జల్లాలి



వరి పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి స్వప్న

కశింకోట: తుపాను వర్షాలకు తడిచిన కోసిన వరి పనలపై ధాన్యం మొలకలు వచ్చే అవకాశం ఉన్నందున వాటిపై ఉప్పు ద్రావణాన్ని జల్లాలని మండల వ్యవసాయాధికారి ఎం. స్వప్న రైతులకు సూచించారు. మండలంలోని సరసాపురం, సోమవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తడిచిన వరి పనలను, వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మడిలో తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణం తడిచేటట్టు పిచికారీ చేయాలన్నారు. లీటరు నీటిలో 20 గ్రాముల కళ్లు ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. కొన్నిచోట్ల వరి పొలాలు పడిపోయాయని, వాటిని తక్షణమే పైకి లేపి దుబ్బులు కలిపి కట్టి నిలబెట్టడానికి చర్యలు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో మినుములు, పెసర విత్తనాలు రబీలో సాగు చేసుకునేందుకుగాను సిద్ధంగా ఉన్నాయన్నారు. మినుములు 4 కిలోలు రూ.392, పెసలు రూ.364 అన్నారు. రబీలో పంటలకు బీమాను రైతులు చెల్లించాలన్నారు. రబీలో వేసే వరి, మినుము, పెసర పంటలకు బీమా వర్తిస్తుందన్నారు. వరికి ఈ నెలాఖరులోగా రూ.630, మినుము, పెసర పంటలకు 15లోగా రూ.300 వంతున ఎకరాకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ సహాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఇదేం 'చెత్త' పని



గుండాల జంక్షన్ వద్ద గోతులో వేసిన చెత్త

అనకాపల్లి: అధ్వాన రోడ్లపై గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే వాటిని బాగు చేయాలన్న సామాజిక స్పృహ లేదు. మండలంలో తుమ్మపాల పంచాయతీ గుండాల జంక్షన్ వద్ద అనకాపల్లి–చోడవరం రహదారి గోతులమయమైంది. వాహనదారులు అందులో పడిపోయి క్షతగాత్రులుగా మారుతున్నారు. స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా పంచాయతీ సిబ్బంది మంగళవారం పారిశుధ్య నిర్వహణ ట్రాక్టర్‌తో చెత్త తీసుకువచ్చి గోతులో వేసి చేతులు దులుపుకున్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం తాళ్లపాలెం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్ల వేతనాలను పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. అర్హులకు పదోన్నతి కల్పించాలన్నారు. జాబ్ చార్టులను ఏర్పాటు చేసి వారికి విధులు నిర్దేశించాలన్నారు. ఆశ కార్యకర్తల ప్రతినిధులు పద్మ, కుమారి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వరాహ లక్ష్మీనృసింహస్వామి దీక్షలు ప్రారంభం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం, దిబ్బవీధి కొబ్బరి తోటలో వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి మాల ధారణ(చందన) దీక్ష కార్యక్రమం బుధవారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు మంగళవారం తెలిపారు. స్వామివారి భక్తులు 41 రోజుల పాటు మండల దీక్ష చేస్తారన్నారు. ఈ నెల 10న 32 రోజులకు, ఈ నెల 23న 21 రోజులకు, జనవరి 4న 11 రోజులకు మాలధారణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

హిందువుల రక్షణకు ర్యాలీ నేడు

అనకాపల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఘోర దౌర్జన్య కాండకు నిరసనగా స్థానిక మెయిన్ రోడ్డు నుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూ చౌక్ వరకూ బుధవారం సాయంత్రం 3 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధి అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి హిందూ రక్షా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీలో హిందువులంతా పాల్గొనాలని కోరారు.